## క్లుప్తంగా

### మాజీ ఎమ్మెల్యేకు పలువురి శుభాకాంక్షలు



మొయినాబాద్: కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్: చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్‌లోని తన నివాసంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య రత్నం వేడుకలు జరుపుకొన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్, రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, క్యామ పద్మనాభం తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

### దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్

షాబాద్: స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంతిరెడ్డిగూడలో బలరామ జయంతి సందర్భంగా రైతు దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశంలో 70 శాతం ప్రజలు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని.. తద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి చెందుతారన్నారు. అధిక సుంకాల పేరుతో దేశాన్ని బలహీనపరిచే కుట్ర జరుగుతున్నట్లు ఆరోపించారు. ఆహార ఉత్పత్తికి అనుకూలమైన భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇతర పరిశ్రమల ఏర్పాటుకు కేటాయించకుండా ప్రభుత్వం చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రైతాంగం మార్కెటింగ్, రెవెన్యూ, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పాలకులు వాటిని పరిష్కరించడంలో సహాయపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు చంద్రయ్యగౌడ్, రామస్వామిగౌడ్, నర్సింహారెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

### శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

కొందుర్గు: శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్‌ఐ రవీందర్‌నాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వినాయక మండపాలను ఆయన సందిర్శంచారు. డాగ్‌స్క్వాడ్‌తో మండపాలు, ఆవరణను తనిఖీ చేయించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సైబరాబాద్ సీపీ అవినాశ్ మొహంతి ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డీజేలు వినియోగించొద్దన్నారు. చెరువులు, కుంటల లోపలికి వెళ్లి ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని, ఇందుకు స్థానికులు, భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు



షాబాద్: వినాయకుడిని దర్శించుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



చేవెళ్ల: వినాయకుడి శోభాయాత్రలో కళాకారుల ప్రదర్శన

## జైజై గణేశా..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 7వ రోజు మంగళవారం బొజ్జగణపయ్యకు భక్తులు, ఉత్సవ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి జయములివ్వు గణేశా అంటూ వేడుకున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పలు గ్రామాల్లో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలు హోరాహోరీగా కొనసాగాయి.



షాద్‌నగర్: మల్లికార్జునకాలనీలో వినాయకుడికి వివిధ రకాల నైవేద్యాలు



షాద్‌నగర్: లడ్డూ దక్కించుకున్న రవికుమార్



కొందుర్గు: మండల కేంద్రంలో..



చేవెళ్ల: మండపం వద్ద అన్నదాన కార్యక్రమం



చేవెళ్ల: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

## స్ఫూర్తి ప్రదాత వైఎస్సార్

సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని పలువురు అన్నారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల పక్షపాతిగా, రైతుబిడ్డగా ప్రజల గుండెల్లో సుస్థిరమైన స్థానం సంపాదించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.



షాబాద్: నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు



నందిగామ: మండల కేంద్రంలో..



కేశంపేట: మండల కేంద్రంలో..



శంకర్‌పల్లి: పట్టణ చౌరస్తాలో..

### పంటల నమోదు తప్పనిసరి

నందిగామ: రైతులు తాము సాగు చేసే పంటల వివరాలను సంబంధిత ఏఈఓల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రామశివరావు అన్నారు. నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము సాగు చేసే వివరాలను వ్యవసాయ శాఖ వద్ద నమోదు చేసుకున్నట్లయితే పంటలను విక్రయించే సమయంలో సులభతరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా రాయితీపై పనిముట్లు కావాల్సిన రైతులు రైతువేదిక వద్ద ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పట్టాదార్‌పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్ పత్రాలను జత చేయాలని సూచించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో నిరుపేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. గత పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. అనంతరం కాలనీ మహిళలు రేషన్‌షాపు ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, డైరెక్టర్ కరుణాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## రోడ్ల అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి

మొయినాబాద్: గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీలోని పెద్ద మంగళారం–చందానగర్ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో బీఆర్‌ఎస్ నాయకులు వరినాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రోడ్ల అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా రోడ్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలయమంగా మారి ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, నవీన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



పెద్దమంగళారం-చందానగర్ రోడ్డుపై గుంతలో వరినాటు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

## రైతుబజారులో వసతుల కల్పనకు కృషి

చైర్మన్ పెంటయ్యగౌడ్

చేవెళ్ల: అందుబాటులోకి వచ్చిన రైతుబజారులో మౌలిక వసతుల కల్పనకు మార్కెట్ కమిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పాలకవర్గం సభ్యులు అన్నారు. చేవెళ్లలోని రైతు బజారులో మంగళవారం కూరగాయల అమ్మకాలు చేస్తున్న చిరువ్యాపారులతో మాట్లాడి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. వ్యాపారులు షెడ్‌లలో గతంలో ఏర్పాటు చేసిన లైట్లు, వసతులు అన్ని పాడవడంతో మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు తమసొంత నిధులతో లైట్లు, తాగునీటి వసతికి కావాల్సిన నల్లాలను ఏర్పాటు చేయించారు. బాత్‌రూమ్‌లు కూడా ఉపయోగించుకునే విధంగా నీటి వసతిని ఏర్పాటు చేసి ఆవరణ మొత్తం శుభ్రం చేసే పనులు చేపట్టారు. వ్యాపారులు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి మహేందర్, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.



రైతు బజారులో చిరువ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ సభ్యులు

## 'కాళేశ్వరం'పై కాంగ్రెస్ కుట్ర

- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- ప్రాజెక్ట్‌పై కేసును సీబీఐకి అప్పగించడాన్ని ఖండిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన



శంకర్‌పల్లి చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



షాద్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, నేతలు

షాద్‌నగర్: కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ నేతలు కల్పతరువు లాంటి కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీడు భూములకు సాగునీరు ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు ఈ ప్రాజెక్టుపై కనీస అవగాహన కూడా లేదని విమర్శించారు. ప్రపంచమంతా ప్రాజెక్టు అద్భుతమని పొగుడుతుంటే.. రేవంత్ సర్కార్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పూరిత రాజకీయాలు ప్రజలను గమనిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, రాజావరప్రసాద్, ఈట గణేష్, నరేందర్, మన్నె కవిత నారాయణ, రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకు కుట్ర**

శంకర్‌పల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అని, దాన్ని ఎండబెట్టి, బీఆర్‌ఎస్‌ను అప్రతిష్ట పాలు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం శంకర్‌పల్లి చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ధర్నాలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పాపారావు, నాయకులు బాలకృష్ణ, ఉపేందర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల దృష్టిని మళ్లించేందుకే సీబీఐ కేసు**

మొయినాబాద్: ప్రజాసమస్యలను పరిష్కరించలేక.. పరిపాలన చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు మాజీ సీఎం కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్రలు చేస్తోందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి ఆరోపించారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మరోసారి మోసం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి చూస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రావుఫ్, డప్పు రాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న నాయకులు


### కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

చేవెళ్ల: మాజీ సీఎం కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తే.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలకు నిరసనగా హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు రేవంత్ సర్కార్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ ప్రాజెక్టుల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలించేందుకు చంద్రబాబు శిష్యుడైన రేవంత్‌రెడ్డి, కేంద్రంలో బీజేపీ నరేంద్రమోదీ కుట్ర చేస్తున్నారన్నారు. కాళేశ్వరంపై కేసును సీబీఐకి అప్పగించే కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు. ఈ ధర్నాలో నాయకులు దేశమోళ్ల అంజనేయులు, శ్రీధర్‌రెడ్డి, శివప్రసాద్, కరుణాకర్‌రెడ్డి, మమహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు

### కేసులతో వేధిస్తే సహించం



షాబాద్‌లో ధర్నా, రాస్తారోకో చేస్తున్న నాయకులు

షాబాద్: కేసుల పేరిట బీఆర్‌ఎస్‌ను వేధించాలని చూస్తే సహించేది లేదని షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ముంబై– బెంగళూరు లింకు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అంతకు ముందు పార్టీ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరంతో తెలంగాణను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ తరఫున నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ నక్క శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## తుది ఓటరు జాబితా విడుదల

- గ్రామ పంచాయతీల్లో ప్రదర్శన
- పాల్గొన్న అధికారులు, కార్యదర్శులు

చేవెళ్ల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తుది వార్డు ఓటరు, పోలింగ్ స్టేషన్‌ల జాబితాను ఎంపీడీఓ హిమబిందు విడుదల చేశారు. మంగళవారం చేవెళ్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి సంబంధించిన పంచాయతీల పోలింగ్‌స్టేషన్లు, వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చిన నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. పంచాయతీల వారీగా కూడా తుది జబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

**అన్ని జీపీల్లో అందుబాటులో..**

కొత్తూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం తుది ఓటరు జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ అరుంధతి ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా అన్ని గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

**29 గ్రామాలు.. 260 వార్డులు**

కేశంపేట: మండల పరిషత్ కార్యాలయంలో తుది ఓటర్ జాబితాను విడుదల చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 29 గ్రామాల పరిధిలో 260 వార్డులను గుర్తించామని, వీటి పరిధిలో 18,316 మంది పురుషులు, 18,631 మంది మహిళలు, మొత్తం 36,947 ఓటర్లు ఉన్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి విద్యావతి తదితరులు పాల్గొన్నారు



చేవెళ్లలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ హిమబిందు. కార్యదర్శులు

**19 గ్రామ పంచాయతీల్లో..**

మొయినాబాద్‌రూరల్: మండల పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని పంచాయతీ కార్యాలయాల్లో వార్డులు, పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించామని ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి సవరించిన ఓటరు లిస్టులను అధికారులు విడుదల చేశారు. సమావేశంలో సూపరింటెంటెంట్ రెహమాన్, కులశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం**

షాబాద్: స్థానిక ఎన్నికలకు గ్రామ పంచాయతీల ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ తుది జాబితా సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్‌ల తుది జాబితా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

**22 గ్రామ పంచాయతీల్లో ప్రదర్శన**



మొయినాబాద్‌రూరల్: జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి



కేశంపేట: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, కార్యదర్శులు

కొందుర్గు: గ్రామ పంచాయతీల వారీగా తుది ఓటరు జాబితాను మంగళవారం అధికారులు విడుదల చేశారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి 186 వార్డులకుగాను మొత్తం 23,659 ఓటర్లు ఉన్నారని ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ తెలిపారు. ఇందులో 11,680 మంది పురుషులు, 11,979 మంది స్త్రీలు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 24 గ్రామపంచాయతీలకు సంబంధించి 204 వార్డులు ఉన్నాయని ఎంపీఓ హన్మంత్‌రెడ్డి తెలిపారు. మొత్తం ఓటర్లు 25,869 మంది ఉన్నారని వివరించారు.